కథానిక

# "ఉదరనిమిత్తం—"

"వల్లపురెడ్డి"

రాత్రి పదిగంటలయింది. సినిమాల విడుదలవల్ల సోడాపొంగులా వచ్చిన జనం మా హోటల్లో టిఫిన్లూ, టీలు సేవించి వెళ్ళిపోయారు. అంతవరకు నిర్విరామంగా పనిచేసిఉండటంమూలాన, వస్తూన్న కొద్దిపాటిజనానికి నాతోటివాళ్లు సరఫరాచేస్తూంటే ప్రక్కనే ఉన్న ఒక కుర్చీపై కూర్చుని, బల్లపై తలపెట్టి కొంచం అలసట తీర్చుకుంటున్నా కళ్లు మూసుకుని.

"ఖంగ్,... ఖంగ్" దగ్గిరే ఉన్న వేరొక ధగ్గిర గంట కర్ణకఠోరంగా మ్రోగింది. ఉలిక్కిపడి లేచి నిల్చున్నా. భారంతో వాలిపోతూన్న కనురెప్పల్ని విప్పి చూసేసరికి ఆ బల్లదగ్గర ఇద్దరు వ్యక్తులు కూర్చుని ఉన్నారు. తొడుక్కునిఉన్న దుస్తుల్ని బట్టి చూస్తే గొప్ప దర్జామనుషులేననిపించింది.

ఆత్రుతగా దగ్గరికెళ్ళి చేతులుకట్టుకుని "సార్" అన్నాను.

"ఏమేమున్నాయి?" ప్రశ్నించాడు బుంగమీసాలాయన.

అడిగిన ప్రశ్న హోటలు పరిచారకుల్ని సామాన్యంగా అందరూ అడిగేదే. అందువల్ల నాకు జవాబు చెప్పటానికి అట్టే తడుముకోనవసరం లేకపోయింది. "దోసా, పూరీ, ఇడ్లీ సాంబార్, మసాలోడా, మైసూర్ పాక్, జిలేబీ, గులాబ్ జామూన్, ఉప్మా, ఆలూబాత్, మిక్చర్..." అని గుక్కత్రిప్పుకోకుండా చెప్పుకుపోతూంటే "ఆగు, పంజాబ్ మెయిలులా పోతే నీవెంట మేమెక్కడిదాక రాము?" అన్నాడు రెండోవ్యక్తి నా ధోరణిపై నవ్వుతూ.

ఇది నా విధి అన్నట్లు చిరునవ్వుతో తల గోక్కున్నా.

"రెండు ఆలూబాత్" ఆర్డరిచ్చాడు మొదటాయన.

త్వరితగతిని వెళ్ళి రెండుప్లేట్లు ఆలూబాత్, గ్లాసులతో నీళ్ళూ తీసుకువచ్చి బల్లమీద ఉంచి, వాళ్ళకు కొంచెందూరంలో నిరీక్షిస్తూ నిల్చున్నా.

వాళ్ళిరువురి ముఖాలవేపు చూస్తున్నాను. ఆ ముఖాల్నెక్కడో చూసినట్లు జ్ఞాపకం. ఎక్కడ చూశానో నా ఊహకు సరిగ్గా అందటంలేదు. వాళ్ళేమేమో మాట్లాడుకుంటూ తింటున్నారు చెంచాలతో. దీర్ఘంగా ఆలోచించేసరికి నా మేధ ఆనాడు ఆ సమయానికి పన్నెండుగంటల క్రితం జరిగిన ఒక ఘట్టం దగ్గరికి వెళ్ళి హఠాత్తుగా ఆగిపోయింది.

* * *

"అందరూ చప్పట్లు కొట్టండొక్కసారి. మరోసారి బాగా కొట్టండి. (కరతాళధ్వనులు) ఇదుగో చూశారూ, ఇదేమిటిది? ఎహ్ క్యా హై? కుచ్ భీనహీ. ఏహ్ మరాహువా ఆద్మీకా సిర్ హై. ఇది ఒక చనిపోయిన మనిషి తలకాయి. ఇందులో ఏమీ లేదు. వొట్టి ఎముకలు. కాని దీనిలోనే గొప్ప కరామతు ఉంది. దీన్ని పూర్తిగా చూసిందాక ఇక్కణ్ణించి అడుగైనా కదల్చారంటే జాగ్రత్త. తల పగిలి చచ్చిపోతారు ఇంటికి వెళ్ళటంతోనే. తరువాత నేను జిమ్మేదారి కాదు. ఇదుగో చూడండి, ఇటుచూడండి; అందరూ." అప్పటికి ఉదయం పది కావస్తూంది. నేను వెళ్ళి ఒంటిగంటకు హోటలు డ్యూటీలో చేరాలి. వస్తూంటే రోడ్డుప్రక్కగా ఉన్న విశాలప్రదేశంలో మూగిఉన్న జనంమధ్య వింతల్ని ప్రదర్శిస్తున్నాడని ఆ మాటలే స్పష్టీకరించినవి.

నాకు బజారులో జరిగే ఘట్టాల్ని, ముఖ్యంగా గారడీ ప్రదర్శనాన్ని చూడాలంటే సరదా. గారడి కృత్యాలపై నమ్మకం ఆదినుంచీ లేదు. ఎందరో గారడీవాళ్ల గొప్పతనాన్ని ఎంతో ఆశ్చర్యజనకంగా

చెబుతారు. కాని నాకుమాత్రం ఎన్నడూ సంపూర్ణ విశ్వాసం కలగలా వాళ్ళ మాటలపై. అయినా వీలుంటే గారడీ దృశ్యాలను పరికిస్తాను. ఎటూ హోటలుకు చేరాల్సిన వ్యవధి ఇంకా కావల్సినంత ఉందిగదా అని తిన్నగా ఆ లోకుల మూకలో దూరాను. జనాన్ని చీల్చుకుంటూ వెళ్ళి ఎట్లాగో ముందు స్థానాన్నాక్రమించినా. గారడీ వ్యక్తి ఒక ఎముక—మనిషి కాలి ఎముకై యుండొచ్చు—తీసుకుని ముందుకూర్చుని ఉన్న పిల్లల కాళ్ళదగ్గర నుంచి చుట్టూరా ఒక గీతగీస్తున్నాడు. ఆ గీతను దాటి రాకూడదని ఆయన ఆజ్ఞ.

అతడు బక్కగా కులుచగా ఉన్నాడు. అతుకుల కోటు, చెదరి, దూళిధూసర సంయుక్తమైన జుట్టు, కట్టుకున్న లుంగీ అన్నీ తగినట్లుగానే ఉన్నాయి. ఒక పాముబుట్ట బయట పెట్టిఉంది. ప్రక్కనే ఉంచిన జోళీలో ఇంకా రెండుమూడు బుట్టలు కొన్ని ఎముకలు అగుపడుతున్నాయి. ఆ బుట్టల్లో పాములున్నాయో లేవో తెలీదు.

పిల్లల్నందరినీ ఒక హద్దులో కూర్చోబెట్టి రంగమధ్యానికివచ్చి మనిషిపుఱ్ఱెను ఎగాదిగా పరికించి ఏదో మంత్రం పఠించాడు. దాన్ని భూమ్మీద ఉంచి చుట్టూరా ఒక గీతగీశాడు ఎముకతో. పిల్లల్ని మళ్ళీ ఒకసారి చప్పట్లు కొట్టమన్నాడు. పిల్లలూ పెద్దలూ ఆపని చేశారు. తన ధోరణి మళ్ళీ మొదలెట్టాడు: “దేఖో, మేరీ కరామాత్ దేఖే బగైర్ అగర్ కోఈ అప్నే జాగా సే హిలా; తో యాద్ రఖ్ నా...అప్నే మాఁ బహనోంసే పాప్ కియే.” హరిహరీ, పాపం శమించుగాక ఎట్లాంటి మాటలు వినాల్సివచ్చింది స్వామీ! ఇక్కడికి రాకపోయినా బావుండేది అని మనస్సులో బాధపడ్డాను. ఇంతవరకు ఎందరినో చూశాను. కాని ఎక్కడా ఇలాంటిమాటలు వినలేదు. అందరు గారడివాళ్లు జనాన్ని మర్యాదగా ‘సాహెబాన్’, మెహర్బాన్’ అనిసంబోధిస్తే వీడు ‘లోగో’ అని పిలుస్తాడు. తాము చూపించే గమ్మత్తు ముగిసిందాకా జనం నిలుచోవాలనే వుద్దేశంతో గారడీవాళ్లు కొన్ని శాపనార్థాలు పలుకుతారు. నేనెన్ని చోట్లో విన్నానలాంటివి. కొన్నిచోట్ల కొందరు గారడీలు తమ వింతను దర్శించకుండా వెళితే, ఇంటికెళ్లేవరకు ఏదో కీడు మూడుతుందని పలికేవారు. మరికొందరు కల్లుకొట్టుదగ్గర ఈతచెట్లయి పుడతారని శపించేవాళ్లు. ఇంకాకొందరు ప్రదర్శనాంతంలో డబ్బులడుక్కునేప్పుడు ఎవరైనా ఇవ్వని వాళ్లుంటే వాళ్ల ఇంటికి చేరేలోపల జేబుల్లోఉన్న నోట్లుకాస్తా భస్మమైపోతాయని భయపెట్టేవారు. కలికాలపు మహిమల తెలిసినవాళ్లు గారడీల మాటల్ని లెక్కచేసేవారు కారు. అమాయకులెవరైనా ఉంటే తక్షణమే ఒకటిరెండు రాగిడబ్బులు పడేసేవారు. కాని ప్రస్తుతపు గారడీవాడు మాత్రం ఎవరైనా అడుగు కదల్చారంటే తమ అప్పాచెల్లెండ్రతో పాపంచేసినట్లంటున్నాడు. వాని పోగరుమాటలు వినేసరికి నాకు అరికాలుమంట నెత్తికెక్కింది. కాని చుట్టూ మూగియున్న వందలాది జనం కిక్కురుమనకుండా నిల్చుంటే నేనొక్కడినీ ఆవేశంతో అరిస్తే ఎవరు లెక్కిస్తారు? అక్కడినుంచి వెళ్ళిపోదామా అనిపించింది. వాడన్నమాటలు జ్ఞప్తికొచ్చి ఒళ్లు కంపించింది. కదలకుండా నిల్చున్నాను.

వాడలాగే తనమాటల్ని అసభ్యంగా రానిస్తూ ఆ పుఱ్ఱెలో ఏదో మహత్తుఉందనీ, దానిమీద్ద చేయి ఉంచినవాళ్ళు మళ్ళీ తీసుకోలేరనీ, ఎవరికైనా గుండెలుంటే ముందుకు రమ్మనీ ఛాలెంజిచేస్తున్నాడు. జనంలోంచి ఒక్కరుగూడా సిద్ధపడలా. నాకు గారడి విద్దెలపై నమ్మకంలేదు. వెళ్ళి, వాడి బండారాన్ని కాస్తా బయటపెడ్దామా అనిపించింది. ఈ ఆలోచన అంతకుముందెన్నోమార్లు తట్టింది. కాని వాళ్ళ జీవనంలో నిప్పెట్టడం భావుండదని ఊరుకున్నా. అంతకంటే ముఖ్యమైన సంగతేమంటే అలా పలువురిఎదుట అలగా వాడిలా నిల్చుని గమ్మత్తులు ప్రదర్శించటం నాకు అవమానకరంగా తోస్తుంది. “ఎవరికీ గుండెలులేవా? పిరికిపందలు...” ఏమేమో అస్తవ్యస్తంగా మాట్లాడుతూ తనే ఆ కరామతు చూపనుంకిస్తున్నాడు.

అంతట్లోనే జనంలోంచి ఒకాయన ముందుకొచ్చి “అరే, అట్టే పేలకు, నాలుక చీల్చివేస్తా జాగ్రత్త. పొట్టకూటికై నలుగురిని యాచించి గడుపుకోటంలోగూడా ఇంత గర్వమా? ఏదిరా నీమహత్తు?” అన్నాడు. ఆయన కొంచం మర్యాదమనిషిలాగున్నాడు. తెల్లని దుస్తులు, గంభీరంగా

ముఖానికి అందంగాఉన్న నల్లని మీసాలు చూస్తే కొంచెం తెలివిగలవాడిలాగే ఉన్నాడు. ఇంకా రెండు మూడడుగులు ముందుకేశాడు.

ముందుకొచ్చిన వ్యక్తిని అతడు ఎగాదిగా చూసి కన్నెర్రచేశాడు. "తూకాక్ హైరే, బీచ్ మే లటక్ నే ఆయా (నువ్వెడివిరా, మధ్యలో ఊగులాడ వచ్చావ్)" అని గర్జించాడు.

"ఏయ్, మాటలు జాగ్రత్తగారానీ. ఒరులతో మాట్లాడటంకూడా తెలీదు; నీకు యాచించటమేం తెలుసు!" అన్నాడు. తరువాత జనాన్ని సంబోధించి "దేఖో భాయీసాబ్, ఎహ్ కైసాబక్తాహై? (చూడండి సోదరునారా, వీడెట్లా పేలుతాడు) నేను వీడినేమైనా అన్నానా? మంచిగా మాట్లాడమని చెప్పాను. ఎవడినాలుక మంచిదో, వాడికి ప్రపంచమంతా మంచిదే. ఔనా, కాదా?" అనేసరికి అందరూ ఆమోదం బయల్పరచారు.

"మధ్యలో అడ్డుతగలటానికి నువ్వెవ్వడవ్? దమ్ములుంటే ఆ పుర్రెపై చేయి ఉంచు"అన్నాడా గారడీ.

"ఓహో, అంతవరకొచ్చిందా? అయితే ఈ మనిషి పుర్రెలో మహత్తు ఉందంటావా? సరే. ధైర్యం కలవాడికి భగవంతుడు సాయపడతాడు. చూడండి భాయీ, నేనీ పుర్రెపై చేయి ఉంచబోతున్నా. మీరంతా ఒకసారి చప్పట్లు కొట్టండి" అన్నాడా రెండోవ్యక్తి. అతని న్యాయప్రవర్తనకీ భగవద్విశ్వాసానికీ ముగ్ధులయిన జనంతోబాటు నేనూ చప్పట్లు కొట్టాను. అతడు సంతోషంతో జనాన్నంతా ఒకమారుచూసి, దానిపై చేయి ఉంచబోతూ ప్రశ్నించాడు: "ఒకవేళ నువ్వన్నట్లు నాచేయి దీనికి అతుక్కోకపోయినట్లయితే ఏమిటి షర్తు?" అని.

"ఏమిటో నువ్వే చెప్పుజే" అన్నాడు గారడీ నిర్లక్ష్యంగా.

"ఇదుగో కొంచెం గౌరవంగా మాట్లాడ్డం నేర్చుకో. సరే, నా చేయి దీనికి అతుక్కున్నట్లయితే ఇదుగో అయిదురూపాయలు" అంటూ జేబులోంచి ఐదురూపాయల నోటు తీసి అక్కడుంచాడు. "మరి నువ్వేం చేయించుకుంటావ్?" అని అడిగాడు.

"అదికూడా నువ్వేచెప్పు" అన్నాడు తేలిగ్గా.

"అయితే విను. నాచేయి దీనికి అతుక్కుపోనట్లయితే నీవీ పరిసరాల్లో ఎక్కడా కన్పడగూడదు. ఈ ఎముకలు, బుట్టలూ అన్నీ తీసి సైడుకాలువలో పారబోసి మరీ వెళ్ళాలి. ఏమంటావ్?" అన్నాడు.

"అచ్ఛా." అంగీకారం చూపాడా గారడీ.

రెండోవ్యక్తి ఆ పుర్రెపై కుడిచేయి పెట్టాడు. గారడీవాడు పెదవులు కదుల్చుతున్నాడు ఆకాశం వైపు చూస్తూ. ఏదో మంత్రం పఠిస్తున్నాడు కామోలు. అరనిముసం సేపు అయాక "ఆమ్, ఫట్" అని గట్టిగా ఈలవేశాడు. "ఇక చేయి తీసుకో" అన్నాడు.

అతడు చేయి తీయటానికి ప్రయత్నించాడు దానిమీదనుంచి. అది చేతికే అంటుకునియున్నట్లు అగుపడింది. నా ఆశ్చర్యానికి మేరలేకపోయింది. అయినా అతడు కొంచెం ప్రయత్నంతో చేయిని ఆ చచ్చిపోయిన మనిషి తలకాయిమీన్నుంచి తీశాడు. ఎదుటి గారడీవాడు నివ్వెర పడ్డాడు. 'నా మంత్ర ప్రభావం ఏమైంది?' అన్నట్లు పెట్టాడు ముఖం పోజు.

అంతటితోపోక "ఏదీ మరోసారి ఉంచు!" అన్నాడు. రెండో ఆయన చిరునవ్వుతూ వాడు చెప్పినట్లు చేశాడు. ఈసారి కొంచెం ఎక్కువసేపే పఠించాడు మంత్రం. అయినా అది పారలేదు.

రెండో ఆయన ఉపన్యాసం మొదలెట్టాడు. "దేఖో భాయీసాబ్! వీడికేమో మంత్రాలు తెలుసట. ఆ ముఖాన్ని చూడండి. వాడిజన్మలో ఒక్కనాడైనా స్నానం చేశాడో లేదో. వాని ముఖం చూస్తేనే రోతగా ఉంది. చిరునవ్వైనా కన్పడదు. ఇంత అపరిశుభ్రత, అసభ్యత నిండుకున్నవానికి ఏవో మంత్రాలూ, ప్రభావాలు! పైగా గర్వం." జనమంతా గుసగుసలు మొదలిడారు గారడీ మనిషి ఏమీ రానివాడనీ, ధోకాఖోర్ అనీ.

"నీ దగ్గర ఏమో ఉంది. అందుకే నామంత్రం పాటికిరాలా. ఏముంది చెప్పు?" అని ఉరిమాడు గారడీ.

"నాదగ్గరేముంది? ఏమీలేదే!" కోటుజేబులు చూపించి చేతులు వెల్లకిల వేశాడు మీసాలమనిషి.

"సరే కోటు తీసిపెట్టి, తరువాత దానిమీద చేయి ఉంచు."

రెండో ఆయన, వాడు చెప్పినట్లు చేసినా గారడివాని మాట అనృతమైంది. ఉండబట్టలేక "చొక్కా విడు" అన్నాడు గారడి.

"నీకేం చొక్కా విడువమంటావ్. కాస్సే పయితే నగ్నంగా కమ్మంటావు. నాపైన అనుమానముంటే మూడోవాని నెవరినైనా పిలుస్తాను." చుట్టూరా ఉన్న జనాన్ని చూసి "దయచేసి ఎవరైనా వస్తారా? మరేం ఫరవాలేదు. భయపడకండి. ఒకరు రండి. ఒక్కరు" అని పిల్చాడు.

పిలుస్తూన్న మనిషిపై నాకేదో అనిర్వచనీయమైన విశ్వాసం ఏర్పడిందా క్షణంలో. నేనే ముందు కడుగు వేద్దామనుకుంటూంటే ఎవరో ఒకాయన వెళ్లాడు. అతడు నిండు యువకుడు. నల్లగా, బలంగా, కండరాలు తిరిగి ఉన్నమనిషి. నిక్కరు, షర్టు తొడుక్కుని ఉన్నాడు.

"నీకేమీ భయంలేదు కదా!" ప్రశ్నించాడు యువకుడిని. ఏమీలేదన్నట్లు నిర్భయంగా తలాడిస్తే "ఏంపని చేస్తావ్?" అనడిగాడు.

"రిక్షానడుపుతాను." అన్నాడా యువకుడు.

"సరే, మంచిదే అయింది. చనిపోయినా ఫరవాలేదు. తిండి సమస్య అయినా తీరిపోతుంది దేశంలో." విశాలభావం వ్యక్తపరచాడు. ఈగీతకు అవతలగా కూర్చుని దానిమీద నీ చేయి ఉంచు" అని ఒక గీత గీశాడు. గారడి ఏవేవో దేవతల పేర్లు స్మరించి మంత్రం వల్లించాడు. ఇక తీయి నీచెయి" అన్నాడు గారడి.

"అయితే చేయి దానికి అతుక్కు పోయిుందటావా?" అని అడిగాడు రెండోమనిషి. "ఆఁ, తప్పకండా." అన్నాడు గారడి.

"తీసుకోరా అబ్బాయి నీ చేయి." అన్నాడు. రిక్షాయువకుడు సులభంగా తీసివేశాడు. గారడీవానికేమీ తోచలా, ఆ గీతదాటి రమ్మన్నాడు. అప్పుడు గూడా ఏమీ జరక్క పోయేసరికి "నువ్వు వాడికి ఏమిచ్చావ్?" అనడిగాడు కోపంతో రెండో ఆయన్ను గారడి.

"ఏమిస్తే నీకేంపని? నువ్వు చేసేదేమిటో చెయ్యరాదూ?" అని వాని చేతగానితనాన్ని పరిహసిస్తూ "చూసుకో అబ్బాయి నీ జేబులు." అని అన్నాడు ఆ యువకునితో. చొక్కా జేబులోంచి ఒక చీటి బయటకు తీశాడు. దాన్నందుకుని "చూడండి భాయీలోగ్, దీనిలో ఏమీలేదు. ఇది ఉట్టికాగితం. దీనిపైన మా గురువుగారు గీసిన కొన్ని గీతలున్నాయి. అంతే. ఇది దగ్గరున్నంత సేపూ ఎవడి మాయలూ ఏమీచెయ్యవ్. ఇలాంటి వన్నీ చిటికలో ఎగరగొట్టొచ్చు" అన్నాడు కాగితాన్ని విప్పిచూస్తూ. దానిలోగీసి ఉన్న రేఖలు మసకగా అంజనేయుని రూపంగా కనడ్డాయి. అతడు గారడీవాని ఆ తలకాయి, ఇంకా ఇతర బొమికలన్నిటినీ దూరంగా గిరాటు వేశాడు. అవి ముక్కలయినయి. జనమంతా "చ్, చ్"అని అయ్యో, వాడి జీవనాధారాన్ని మంటిపాలు చేశాడని జాలి ప్రకటించారు.

గారడీవానికి కొంచెం కోపంవచ్చి "అరేయ్, నా మంత్రాలకు విరుగుడైతే చూపించావ్. నీ కేమైనా తెలుసా. తెలిస్తే నన్ను చిత్తుచెయ్యి." అని ప్రగల్భం ఆడాడు.

"ఓహో. నీకింకా పులుసు చావలా. నాకేమీ విద్యలురావు. కాని భగవాన్ దయచూస్తే అదీ చేస్తాను." జనం వైపుచూసి "మీరు చెయ్యమంటే కొంచం నా కరామతు గూడా చేస్తా." అన్నాడు.

జనంలో కొందరంగీకరించారు. మిగతా ఆర్ద్రహృదయులందరూ గారడీవానికేం హాని కలిగిస్తాడో అనేభయం కొద్దీ "పోనీయండి, బికారీముండావాడు." అన్నారు. అంగీకారం బయల్పరచినవారి సంఖ్య అధికంగా ఉన్నందున అతడు గారడీవాణ్ణి సంబోధించి "సరేకాచుకో" అన్నాడు. ఇరువురూ ఒకరికొకరు అభిముఖంగా, నాలుగైదు గజాల ఎడంగా కూర్చున్నారు. ఎవరికి తోచిన మంత్రాలు వాళ్ళు లోలోపలే పఠించారు ఒక నిమిషం. గారడీవాడు ఇంకా మంత్రం చదువుతూనే ఉన్నాడు. రెండోమనిషి ఆకాశం దిక్కు అదో మాదిరిగా చూసి "హే, భగవాన్" అని బిగ్గరగా అరచి చేత్తో నేలను చరిచాడు బలంగా. వెంటనే ఎదుట ఉన్న గారడీవాడు భూమికి మూడడుగుల ఎత్తెగిరి పడ్డాడు. దెబ్బతిన్న పాములా మెలికలు తిరుగుతూ నోటరక్తం క్రక్కుతున్నాడు. అందరి హృదయాల్లో అనుకంప "ఖోద్‌దో బేచారా" అనే మాటలద్రూపంగా వెలివచ్చింది.

"సరే, మీరింత దయ కనపరుస్తున్నారుగదా, ఏదీ వాని పొట్టకై ఎవరెవరెంత దానం చేస్తారో చేయండి. మీకు తోచినంత. అణా, అర్థణా, కానీ..." అంటూ గారడీవానిదే ఒక చింకిగుడ్డ భూమ్మీద పరచాడు. కొన్ని అణాలు, కొన్ని కానీలు పడ్డాయి. నా జేబులో ఏమీ లేనందున విచారపడ్డాను. వాడు పడుతూన్న బాధ చూడలేక అందరూ విడిచిపెట్టమని వేడారు.

"మీరు కోరినట్లు ఇప్పుడే విడుస్తాను. కాని ఇదుగో చూడండి. ఈ చిన్న కాగితం దీనికంతకూ కారణం. దీన్ని దగ్గర ఉంచుకుంటే మీకెక్కడైనా జయమే. ఇలాంటివి నా దగ్గర కొన్నే ఉన్నాయి" అంటూ కోటు జేబులోంచి మరికొన్ని చీటీలు తీశాడు. "వీటిని అందరికీ ఉచితంగా ఇస్తాను. ఎవరెవరు భద్రపరుస్తారు? చేయెత్తండి" అన్నాడు.

అందరూ "నేను నేను" అంటూ చేతులెత్తారు. మంత్రతంత్రాలపై విశ్వాసంలేని యంత్రయుగపు మనిషిని, అకస్మాత్తుగా నా చేయికూడా పైకి లేచింది. అంతేగాదు; "నేను భద్రపరుస్తాను" అనే మాటలుగూడా అప్రయత్నంగా వెలువడినయి వాతెరలగుండా.

"సంతోషం. నేను వీటికి ఒక్కొక్కదానికి పావలా తీసుకుంటే ఎందరిస్తారు?" కొన్ని చేతులతో బాటు నా చేయిగూడా దిగిపోయింది. చుట్టూ చూశాను ఎవరైనా పరిచయస్తులున్నారేమోనని. ఎవ్వరూ అగుపించలా. నిరాశతో నిట్టూర్పొకటి విడిచాను. "ఇక్కడికి ఇంతమంది తయారుగాఉన్నారు. బహుత్ ఖుష్. దీని వెల రూపాయి చేస్తే?" అన్నాడు. చాలా చేతులు వాలిపోయినయి. నాలుగైదు నిలిచాయి. "మరేం లేదు. ఊరకే అన్నాను. దీన్ని అర్థరూపాయికొకటి మా గురువు ఆజ్ఞప్రకారం యిస్తాను. ఎవరెవరికి కావాలో ముందుకు రండి" అన్నాడు. డబ్బులున్నవాళ్ళంతా నడిచారు ముందుకు. ఒక ఏభైదాకా ఇచ్చాడేమో! అయిపోయాయన్నాడు. కొందరు ఆశాహతులయి వెనక్కు తగ్గారు. నేనుమాత్రం సమయానికి డబ్బులు జేబులో వేసుకోవటం మరచినందుకు నన్ను నేను నిందించుకున్నాను.

తరువాత అతడు ఆచీటీలను ఎలా భద్రపరచాలో కొన్ని నిబంధనలు చెప్పాడు. తనకు సాయపడిన రిక్షావానికి ఒకటి ఉచితంగా ఇచ్చాడు. "ఇకవానిని విడిచి పెట్టనా?" అనడిగాడు జనాన్ని. అందరూ ఆమోదించేసరికి ఇంకా గిలగిలా తన్నుకుంటూన్న గారిడివాడిని "క్యాంరే, విడువనా?" అనడిగాడు. విజయగర్వంతో గారడీవాడు దీనంగా తలాడిస్తూ చేతులు జోడించాడు. "ఇప్పటినుంచి ఎక్కడా ఇలా చెయ్యవుకదా?" అన్నాడు అతడు. అంగీకరించాడు గారడి.

రిక్షా యువకుడిని పిలిచి ఆ చీటీని వానిముక్కు దగ్గిర కాస్సేపుంచమన్నాడు. యువకుడలా చేసేసరికి గారడీవాడు తేరుకొని జోళీ సర్దుకుని నమస్కారం చేశాడు. "ఆదుగో ధర్మాత్ములు దానం చేశారు చూడు, వాటిని తీసుకో, నాలుక మంచిదైతే, పొట్ట ఎక్కడైనా గడుస్తుంది. ఇదుగో యీ అర్థరూపాయి తీసుకో" అంటూ ఒక అర్థరూపాయ ఇచ్చి పొమ్మన్నాడు.

పిమ్మట అందరూ ఆ వింతనుగూర్చి మాట్లాడుకుంటూ వెళ్ళిపోయారు. అలాగే నేనూను.

* * *

వారే వీరు! దుస్తులోని భేదమేగాని, మిగతా విషయాల్లో ఏమీ పొరబాటులేదు. అబ్బ! ఎంత మోసం!

"కూల్ డ్రింగ్స్" ఆర్డరిచ్చారు వాళ్లు.

తెచ్చిపెట్టాక త్రాగి వెళ్ళిపోయారు ఎదురుగా ఉన్న వెంకటేశ్వర సినిమాహాల్ వైపు. వాళ్ళు ఆడిన నాటకమంతా నాకప్పుడుగాని తెల్లం కాలేదు. వాళ్లనుగూర్చి ఆలోచిస్తూంటే మరో బల్లదగ్గర గంట మ్రోగింది.

---

బీదవాళ్ళని ఉద్ధరించడానికి పాలకవర్గం ఎన్ని ప్రణాళికలైనా వెయ్యడానికి సిద్ధంగా ఉంటుంది. కాని వాళ్ళ బుజాలమీద సవారీ చెయ్యడం మాత్రం ఎన్నడూ మానదు.—టాల్‌స్టాయ్